

పరుచుకున్న వెన్నెల పరుగెత్తే మనసు

కొల్లిపాక రమామణి

ఆకాశమంతా నల్లమబ్బులు కమ్ముకున్నాయి. ఎప్పుడైనా వర్షం పడవచ్చు.

సంధ్య మనసులో కూడా దిగులు ఆవరించింది. ఉదయం లేచినదగ్గర నించీ యింటిపనులలో మునిగిపోయినా, మనసు ఎక్కడో ఆలోచిస్తూంది. ఆదివారం, పిల్లలిద్దరికీ తలంటుపోసి, తనూ తలంటుకుంది. తడి ఆరనిజుత్తు జారుముడి వేసుకుని, యిడ్డెన్లుచేసి, పిల్లలిద్దరికీ పెట్టింది.

"నువ్వు తినలేదేం అమ్మా?" అందినీల.

"తింటాను" అంది సంధ్య. కాని తినలేదు. వంట మొదలుపెట్టింది.

సన్నగా జల్లు ప్రారంభమైంది. వంటింటి కిటికీలోంచి లోపలికి పడుతోంది.

"అమ్మా, యివాళ అంకుల్ రారేమో! వర్షంలో ఎలావస్తారు?" అంది నీల తిరిగి.

తన మనసులోని భయాన్నే కూతురు చెప్పినట్టు భావించింది సంధ్య.

"ఏమో, రారేమో!" అంది నిర్లక్ష్యం

నటిస్తూ. కాని ఆమె మనసంతా అతని ఆగమనానికి ఆత్రుతపడుతోంది.

నీల కాలుగాలినపిల్లిలా యిల్లంతా తిరుగుతోంది.

"అమ్మా, బావుందా?" బాబు తల్లి కొంగు పట్టుకులాగాడు. వాడి రెండో చేతిలో డ్రాయింగ్ పుస్తకం, దానిలో బఫూన్‌బొమ్మ. చేతులనిండా, బట్టల నిండా నీటి రంగులు ఆ చేత్తోనే ముక్కు తుడుచుకున్నట్టున్నాడు. ముక్కు చివరంతా ఆకుపచ్చరంగు. సంధ్య నవ్వింది. "ఆఁ బాగుంది. నువ్వేబఫూన్‌లా ఉన్నావు. పోయి ముఖం, చేతులు కడుక్కో" అంది.

"అంకుల్‌కి చూపిస్తా. అమ్మా, అంకుల్ మనని యివాళ సర్కస్‌కి తీసుకువెళతారా?" వాడి కళ్ళనిండా ఆశ.

"అసలు అంకుల్ యివాళ వస్తారో రారో!"

"ఎందుకు రారు? క్రిందటి ఆదివారం చెప్పారుగా, యివాళవచ్చి మనందరినీ సర్కసుకి తీసుకువెళతాననీ!" వాడికి అంకుల్‌మీద ఎంత నమ్మకం!

బాబు ముఖంకడుక్కోడానికి నీళ్ళగదిలోకి వెళ్ళాడు. కాలింగ్ బెల్ మ్రోగింది.

"అరుగో అంకుల్ వచ్చారు" బాబు తుర్రుమన్నాడు. నీల దబదబ పరుగెత్తిన చప్పుడు, తలుపుతీసిన శబ్దం.

"హలో నీలా, హలో బాబూ" శంకర్ గొంతు. పిల్లలిద్దరి నవ్వులు. సంధ్య గుండె దడదడ లాడింది.

"అయ్యో, అంకుల్ మీరు పూర్తిగా తడిసిపోయారే! తువాలు తీసుకురానా?" నీల.

సంధ్య తువాలు తీసుకొని ముందు గదిలోకి వచ్చింది. శంకర్ పూర్తిగా తడిసిపోయాడు. తలమీదనించి నీళ్ళు క్రిందికి కారుతున్నాయి. ఆమెకి కష్టం తోచింది. అతని కళ్ళు ఆమె కళ్ళతో కలుసుకున్నాయి. అతని కళ్ళలోకి మెరుపు వచ్చింది. "హలో, సంధ్యా" పలకరింపుకి, ఆమెనవ్వికళ్ళువాల్చుకుంది.

"నీలా, అంకుల్‌కి తువాలు యివ్వు. నేను కాఫీచేసి తెస్తా."

వడివడిగా వంటింట్లోకి నడిచింది సంధ్య. గాస్ స్టౌ వెలిగించి, ఒకవైపు యిడ్లెన్లగిన్నె పెట్టింది. రెండో ప్రక్క కాఫీకి నీళ్ళు పడేసింది.

వాళ్ళది మేడమీద రెండో అంతస్థులో పోర్షను. పడకగది, డ్రాయింగ్ రూమ్, రెంటినీ ఆనుకుని వీధివైపుకి రెండు బాల్కనీలు. బాల్కనీలో కూచుని చూస్తే వీధి చక్కగా కనిపిస్తుంది. పడక గది మధూ, అతని భార్య లీల వాడుకుంటారు. డ్రాయింగ్‌రూమ్ రాత్రికి సంధ్యకి, పిల్లలకి పడకగదిగా మారుతుంది.

శంకర్, పిల్లలూ డ్రాయింగ్‌రూమ్‌లో కూచున్నారు. అక్కడ ఏంచేస్తున్నారో

కాని, వాళ్లు ముగ్గురూ నవ్వుతున్నారు. పిల్లల నవ్వులతో యిల్లంతా నిండి పోయింది. అప్పటిదాకా నిశ్శబ్దంగావున్న ఆ యింటికి ఒక్కసారి చైతన్యం వచ్చి నట్టు వుంది.

జుత్తు ఒక్కసారి వేళ్ళతోనే సవ రించుకుని, యిడ్లెన్లప్లేటు పట్టుకుని డ్రాయింగ్‌రూమ్‌లోకి బయలుదేరింది సంధ్య ఆమె కాళ్ళు తడబడ్డాయి.

గదిలో ఒక్కసారి మాటలు ఆగి పోయాయి. పిల్లలిద్దరూ నవ్వును బిగ పెట్టుకున్నారు. ఆమె ఆశ్చర్యంగా అతని వైపు చూసింది. అతని కళ్ళలో కొంటెతనం.

"అమ్మా, అంకుల్‌ని చూడు" బాబు కిసుక్కున నవ్వాడు. నీల కిలకిలా నవ్వింది.

సంధ్యగమనించలేదు. శంకర్ పాంట్ స్థానంలో సంధ్య చీరను నాలుగుగా మడిచి లుంగీలా కట్టుకున్నాడు. పైన తువ్వాలు కప్పుకున్నాడు. అతని పాంటూ, షర్టూ వరండాలో తాడుమీద వ్రేలాడుతున్నాయి.

శంకర్ రూపుచూసి సంధ్య నవ్వు అణచుకోలేకపోయింది. గట్టిగానే నవ్వింది. ఆ నవ్వుతో యింతవరకూ వున్న సంకోచం పోయింది.

అతనుమాత్రం ఏంచేస్తాడు? మధు లుంగీలు కట్టడు. అతని పైజామాలు శంకర్‌కి సరిపోవు. శంకర్ మంచి పొడుగు.

"తీసుకోండి," అంది యిడ్లన్ల ప్లేటు బల్లమీద పెడుతూ. "వెరీగుడ్. వేడి వేడి యిడ్లెన్లూ, కొబ్బరిపచ్చడీ." సంతోషంగా అతను పళ్ళెం ముందుకు లాక్కున్నాడు. కొబ్బరి పచ్చడంటే అతని కిష్టమని ఆమెకు తెలుసు.

"పిల్లలూ, మీరో? మీరూ యిడ్లెన్లు తెచ్చుకోండి."

"మేం యిందాకే తినేసాం అంకుల్. అమ్మే తినలేదు."

"తొందరగా మీ ప్లేటూ తెచ్చుకోండి" అన్నాడతను. చెయ్యి వెనక్కి తీసుకుని, సోఫాలో వెనక్కి వాలుతూ.

"ఉహుఁ మీరు తినండి. మీకు నేను కాఫీ కలిపి తీసుకువస్తా." సమాధానం కోసం ఆగకుండా వెనక్కి తిరిగిందామె.

"మీ అమ్మకి నేనంటే యిష్టంలేదు, చూశావా నీలా? నాతో కూచుని యిడ్లెన్లు తినదుట." సన్నగా నవ్వాడు శంకర్.

"అమ్మకి మీరంటే చాలా యిష్టం అంకుల్."

"నీ కెలా తెలుసూ?" కొంటెగా అడిగాడు.

నీల తెల్లమొహం వేసింది. అతను నవ్వేసాడు. పిల్లలిద్దరూ నవ్వారు.

ఆ గదిగుమ్మం దాటుతున్న సంధ్యకి వారి మాటలు వినపడ్డాయి. తాను ఎక్కడో హృదయకుహరంలో

గుప్తంగా దాచుకున్న మాటలు ఎవరో వెలికితీసి, గట్టిగా చదివేసినట్టు ఆమె భయపడింది. నీలమీద పట్టరానంత కోపంవచ్చింది. సిగ్గుతో తిరిగి వంటిల్లు దాటి ముందరికి రాలేకపోయింది. కూతురిచేత శంకర్ కి కాఫీ పంపించింది.

ఆమె వంట అయేసరికి పదకొండు దాటింది. అప్పటికి వర్షంకూడా తగ్గు ముఖం పట్టింది.

"బాబూ, భోజనానికి వస్తారా?" లోపలినించే పిలిచింది సంధ్య.

''అంకుల్ మీరూ రండి''నీల పిలుపు.

"ఇప్పుడేకదా నేను యిడ్లీ తిన్నాను. మీరు తినండి"

"ఉహుఁ. మీరూ మాతో తినాలి అంకుల్" నీల మారాం.

"పదండి. నేనూ మీతో డైనింగ్ టేబిల్ దగ్గిర కూచుంటా."

శంకర్ యిద్దరు పిల్లలినీ చెరో చేత్తో పట్టుకుని వంటింట్లోకి వచ్చాడు.

వారి వంటిల్లు పెద్దదే. ఒకవైపు వంటకీ, రెండో ప్రక్క భోజనాల బల్లకి సదుపాయంగా వుంది.

పిల్లలిద్దరూ భోజనాలకి కూర్చు న్నారు.

"ఛ, యిదేంకూర? నాకొద్దు" అంది నీల.

"బంగాళదుంపలు, నీ కిష్టమేకదా!'' అంది సంధ్య.

"వేపుడు చేయలేదేం? ఈ ముద్ద కూరేంటి? లీలత్త అయితే చక్కగా వేయించి పెడుతుంది."

"రోజూ వేపుడేనా? ఈ మసాలా కూరకూడా ఎంతో బాగుంటుంది."

నీల నసుగుతూ కొంచెం కూర తిని, వదిలిపెట్టేసింది. "ఆ కూరంతా తినె య్యాలి. ఏదీ పారెయ్యకూడదు. బాగా తింటేనే నేను మిమ్మల్ని సర్కస్ కి తీసుకువెళతా" శంకర్ బెదిరించాడు.

నీల బుంగమూతిపెట్టి, అయిష్టంగానే కూర తినేసింది.

"ఎన్ని గంటలకు వెళదాం అంకుల్?" బాబు తొందర.

"తొందరగా భోజనంచేసి, నువ్వూ, అక్కా కాసేపు పడుకోండి. నాలుగింటికి బయలుదేరుదాం."

"ఉహుఁ నాకునిద్రరాదు అంకుల్."

''ఇప్పుడు పడుకోపోతే, మళ్ళీ రాత్రి సర్కస్ లో నిద్రపోతారు. ఆఖర్నే మంచి మంచి మోటార్ సైకిల్ ఫీట్స్ వున్నాయి."

"అంకుల్ నేను పడుకుంటా" నీల.

''నేనూ నిద్రపోతా" బాబు.

''అలా ఉండాలి మంచి పిల్లలంటే."

సంధ్య పిల్లలిద్దరికీ చేతులు కడిగి, తుడిచింది. శంకర్ పిల్లలను తీసుకుని పడకగదిలోకి వెళ్ళాడు.

ఆమె కంచాలు కడిగి, టేబిల్ శుభ్రంచేసి, అతనికోసం కంచం పెట్టింది.

"అదేమిటి ఒకటే పెట్టారు? మీరు

తినరా! నేను ఒంటరిగా కూచుని తినను" శంకర్ వంటింటి గుమ్మానికి చెయ్యి ఆన్చి నుంచున్నాడు.

సంధ్య మాట్లాడలేదు. మౌనంగా యింకో కంచం పెట్టింది. తాను కలసి తిననంటే, అతను భోజనం చెయ్యడు. కాని ఒంటరిగా అతని ఎదురుగా కూర్చుని భోజనం చెయ్యాలంటే ఏదో సంకోచం.

"పిల్లలిద్దరూ యిట్టే పడుకున్నారు" అన్నాడు శంకర్, అన్నం కలుపుతూ.

ఇల్లు నిద్రపోతున్నట్టు నిశ్శబ్దంగా వుంది. "కూర చాలా బాగుంది" అతను మళ్ళీ కూర వడ్డించుకున్నాడు.

శంకర్, మధు స్నేహితుడు. ప్రతి ఆదివారం వారింటికి వస్తాడు. వారితో రోజంతా గడుపుతాడు. మధుతో, లీలతో సంధ్యతో కలిసి భోజనం చేస్తాడు సాయంత్రం పిల్లలను స్కూటర్ మీద ఎక్కడికేనా తీసుకువెళ్ళితిప్పుకువస్తాడు. పిల్లలు ఎంతో ఉత్సాహంతో అతని రాకకు ఎదురుచూస్తారు. అతను రాని ఆదివారం లేదు.

"మధు దగ్గరనించి ఉత్తరం వచ్చిందా?"

"ఆఁ, అన్నయ్య ఒంటరిగా యిర వయ్యోతారీకు యిక్కడకు వస్తాడట. వదిన అటునుంచి ఆటే ఏలూరు వెళ్ళి, ఓ పదిహేనురోజులు వుండి వస్తుందిట."

"మధు వచ్చేసరికి నేను ఉండను." ఆగాడతను. ఆమె ప్రశ్నార్థకంగా అతనివైపు చూసింది.

"రేపు నేను బొంబాయివెళుతున్నాను. ఆఫీసువాళ్ళు పంపుతున్నారు. నిన్ననే వెళ్ళవలసింది. కాని రేపటికి వాయిదా వేయించుకున్నాను"

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?" ఆమె కంఠంలో ఆతృత దాచుకుందామన్నా దాగలేదు.

"ఓ నెలరోజు లవుతుందేమో!"

"అన్ని రోజులే!" ఆమె తినడం మానేసింది.

"పని తొందరలో అయిపోతే ముందు గానే వచ్చేస్తా." అతను ఆమె కళ్ళలో భావాన్ని గమనించాడు.

"పిల్లలు మీకోసం ఎదురుచూస్తారు" అంది ఆమె, అతని చూపులని తప్పించుకుంటూ.

"నాకు తెలుసు" అతను మెల్లిగా నవ్వాడు.

ఆమె నాలుగు మెతుకులు కతికి భోజనం అయిందనిపించింది.

"అరె! అప్పుడే మజ్జిగ వడ్డించుకున్నారు! ఇవాళ మెయిల్ స్పీడులో తినేసారే!" అన్నాడతను.

ఆమె నవ్వేసింది.

"సాయంత్రం మీరూ సర్కస్‌కి రావాలి." శంకర్ లేచి, చెయ్యికడుక్కున్నాడు.

"నేను రాను'' అంది తల అడ్డంగా తిప్పుతూ సంధ్య.

"రావాలి. ఒంటరిగా మీరు యింట్లో కూచుని ఏంచేస్తారు." అతను వంటిల్లు దాటాడు.

వంటిల్లు సర్ది, సంధ్య పడకగదిలో పిల్లలమధ్య నడుం వాల్చింది. శంకర్ డ్రాయింగ్‌రూమ్‌లో సోఫామీద దిండు పెట్టుకుని, వెనక్కివాలి పేపరు చదువు తున్నాడు.

శంకర్ ఎప్పుడూ ఆమెతో ఎక్కువగా మాట్లాడడు. కాని మౌనంగా అతను చూపే ఆదరణ, అనురాగం ఆమె హృదయాన్ని తాకుతుంది.

నీల, బాబు లేచారు. వాళ్ళకి ఒకటే హుషారు. పాలు తాగేశారు బట్టలు వెయ్యమని తల్లిని వేధించారు.

"అంకుల్, నా ఎర్రగౌను చూడు, ఎంత బాగుందో," అంది నీల పరుగెత్తుకుని శంకర్ దగ్గిరికి వెళ్ళి.

"చాలా బాగుంది. మరి మీ అమ్మ కూడా రెడీయేనా? అమ్మకూడా మనతో సర్కస్‌కి వస్తానంది" శంకర్ మాటలు వంటింట్లో బ్రెడ్ సాండ్‌విచెస్ చేస్తున్న సంధ్యకి గట్టిగా వినిపించాయి. అతను కావాలనే అబద్ధం చెప్తున్నాడు.

"నేనలా అనలేదు'' అని పిల్లలతో చెప్పలేదు తాను. కాని అతనితో ఒంటరిగా బయటకు వెళ్ళడమా? ఆమె సందిగ్ధంలో పడింది.

"ఓ అమ్మకూడా వస్తోందా!" పిల్లలిద్దరూ గెంతులు వేశారు.

"అమ్మా, నువుకూడా వస్తున్నావా? తొందరగా తయారవమంటున్నారు అంకుల్."

సంధ్యకి అతనిమీద కోపం వచ్చింది. అయినా నిస్సహాయత. అభిమానంతో అతను ఆమెని జయించగలడు.

బట్టలు మార్చుకుని బయటికివచ్చింది పిల్లలూ, శంకర్ గుమ్మందగ్గరే ఎదురు చూస్తున్నారు.

అతను ఆమెని చూశాడు. ఆడంబరం లేని అలంకరణ. అయినా ఆమె అలంకరణలో ఆకర్షణవుంది. పసుపు అంచు వున్న ఆకుపచ్చచీర కట్టుకుంది. పసుపు రంగు జాకెట్టు. నుదుట కనీ కనిపించనట్టువున్న చిన్న నల్లచుక్క. జుట్టు సాఫీగాదువ్వి, చిన్నముడి వేసుకుంది.

"నీలా, నువ్వూ, నేనూ బస్‌మీద వెళదాం" అంది సంధ్య తలుపువేస్తూ.

"అంకుల్ స్కూటర్ వుంది. కదమ్మా! అందరం వెళ్లిపోదాం."

"మనందరం ఒక స్కూటర్‌మీద పట్టం."

"ఎందుకు పట్టం? రింకు, టింకు, పింకు, వాళ్ళ మమ్మీ, డాడీ అందరూ కలసి ఒకే స్కూటర్‌మీద వెళతారుగా!"

సంధ్య విసుక్కుంది "నీలా, నీక్కాదూ చెపుతూంట? మనం బస్‌మీద పోదాం రా."

నీల అయిష్టంగా చూసింది.

"అరె! నీలా, మీ అమ్మకి స్కూటర్ ఎక్కడమంటే భయం. అందుకే రానంటూంది. మీరు బస్ మీద వచ్చెయ్యండి."

శంకర్ పరిస్థితిని కాపాడాడు.

నీలా, బాబూ నవ్వారు.

"అమ్మకి స్కూటరంటే భయం" బాబు గట్టిగా నవ్వాడు.

నీల, సంధ్య బస్‌మీద సర్కస్ దేరాలు చేరారు. పిల్లలిద్దరూ మధ్యన కూచుంటే, శంకర్, సంధ్యా వాళ్ళకి చెరొకవైపున కూర్చుని సర్కస్ చూశారు. ఓ మూడుగంటలు వాళ్ళు నలుగురూ తక్కిన ప్రపంచాన్ని మరిచి పోయారు. తను పెద్దవాడయ్యాక బఫూన్ కాబోతున్నట్టు బాబు తన నిర్ణయాన్ని ప్రకటించేసాడు.

సర్కస్ పూర్తయేసరికి పిల్లలిద్దరికీ నిద్రకళ్ళు పడ్డాయి. హోటల్‌లో ఏకంగా భోజనంచేసి, యింటికి వెళదామన్నాడు శంకర్. బసుల్లో చాలా రష్ ఉండటం వల్లశంకర్ స్కూటర్‌మీద పిల్లలతో పాటు కూచోక తప్పలేదు సంధ్యకి.

"అమ్మా! రోజూ ఆదివారం అయితే బాగుండును" అంది నీల, హోటల్లో తందూరీ రొట్టెలు తింటూ.

"ఎందుకూ?"

"రోజూ అంకుల్ వస్తారుగా!"

శంకర్ గట్టిగా నవ్వి, ఎడంచెయ్యి నీల తలమీద ప్రేమగా వేసాడు.

సంధ్య కూడా నవ్వి, కళ్ళు వాల్చుకుంది.

భోజనంచేసి, యిల్లు చేరేసరికి రాత్రి పదకొండు దాటింది. బాబుని భుజంమీద వేసుకుని లోపలికి తీసుకువచ్చి పడుకో బెట్టాడు శంకర్. నిద్రలో తూలుతున్న నీలను నడిపించుకు వచ్చింది సంధ్య.

"కొద్దిగా మంచినీళ్ళు కావాలి."

సంధ్య వంటింట్లోకి వెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చేసరికి అతను వీధివైపు బాల్కనీలో పిట్టగోడ నానుకుని నుంచున్నాడు. ఆమె గ్లాసు అతనికి అందించి వెనక్కి తిరిగింది.

"సంధ్యా!"

ఆమె ఆగి అతనివైపు చూసింది. అతను దూరంగా ఎక్కడో చూస్తున్నాడు. ప్రొద్దుటి వర్షం ప్రభావం కావచ్చు-ఎవరో ఆకాశాన్ని శుభ్రంగా కడిగి, రంగువేసినట్టు స్వచ్ఛమైన నీలి రంగుతో అందంగావుంది. నక్షత్రాల కాంతి ఆ రంగుకి మెరుపు పూత పూసినట్టు వుంది. లెక్కలేనన్ని నక్షత్రాలను చూస్తూ "అమావాస్యనాడు కూడా ఆకాశం ఎంత బాగుంటుంది!" అనుకుంది సంధ్య.

అతను హఠాత్తుగా ఆమెవైపు తిరిగాడు.

"సంధ్యా నన్ను పెళ్ళిచేసుకోడానికి మీకేమైనా అభ్యంతరమా!"

అతని మాటలు వింటూనే ఆమె పారిపోయింది. ఎప్పుడో ఒకప్పుడు యీమాట అతని నోటినుంచి వస్తుందని తెలుసు. కాని ఆ రోజు యీరోజే అవుతుందనుకోలేదు. ఆసరా కావాలి అన్నట్టు బాల్కనీ గోడని పట్టుకు నుంచుంది. పిట్టగోడ మీదనున్నఆమె చేతులు వణికాయి. ఆమెవి చిన్నచేతులు. వణుకుతున్న ఆ చేతుల దగ్గిరకి అతని బలమైన చేయి కదిలింది. కాని మధ్యలోనే అతనిచెయ్యి ఆగిపోయింది.

"నన్ను కొంచెం ఆలోచించుకోనీండి."

"మీకు కావలసినంత టైము యిస్తున్నను. నేను బొంబాయినించి రాగానే మాత్రం మీ సమాధానంకోసం ఎదురు చూస్తా. నాకు సుముఖంగానే మీ జవాబు ఉంటుందని ఆశిస్తా. మధుతో తర్వాత మాట్లాడుతా. వస్తా." అతను గబగబా వెనక్కి తిరిగి బయటి గుమ్మందాకా వెళ్ళాడు. ఒక్క క్షణం ఆగి "సంధ్యా" అని పిలిచి, ఏదో చెప్పబోయాడు. ఆమె అతనివైపు తిరిగింది. అతని కళ్ళనిండా ఆమెమీద ఆరాధన.

"అచ్చా. గుడ్‌నైట్. ఉత్తరం రాస్తా. జవాబు రాస్తారుగా?"

"రాస్తా" అన్నట్టు ఆమె తల వూగించింది.

అతను తలుపు తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు. తలుపువేసి, ఆమె తిరిగి బాల్కనీ దగ్గరకివచ్చి, క్రిందికి చూసింది. శంకర్ వచ్చి స్కూటర్ స్టార్ట్‌చేసి, ఎక్కి కూర్చున్నాడు. అతను తల పైకి ఎత్తిచూసాడు. సంధ్య గబుక్కున స్తంభం ప్రక్కకి తప్పుకుంది. అతని పెదవులమీదికి చిరునవ్వు ప్రాకింది.

* * *

2

''అనిల్, పిల్లలను తీసుకుని అలా తిప్పుకురారా. తెల్ల సింహాన్ని చూసి రండి" అంటూ లలిత పిల్లలను పంపేసింది.

లలితా, సంధ్యా 'జూ'లో కూచున్నారు. 'జూ' పెద్దది. చాలా మంది జనం వచ్చారు. అయినా అంత మందిలోనూ వాళ్ళకి ఏకాంతం దొరుకుతుంది. పిల్లలు జంతువులను చూస్తూ రెండు మూడుగంటలు తల్లులను వేధించరు.

స్నేహితురాళ్ళిద్దరూ పచ్చగడ్డిలో కూచున్నారు. వారికి కొద్దిదూరంలో ఎఱ్ఱముక్కు తెల్లకొంగలు నీటిలో జలకాలాడుతున్నాయి. లలిత అల్లుతున్న స్వెటర్ వుంది.

"చెప్పమ్మాయ్" అంది లలిత.

"ఏంచెప్పను?" కొంగలను చూస్తూ అంది సంధ్య.

"ఈ మధ్య ఏదో జరిగింది."

"ఎక్కడ?"

"నీ జీవితంలో."

"నా జీవితంలోనా?'' సంధ్య ఆశ్చర్యం ప్రకటించింది.

"ఈ మధ్య నువ్వు చాలా పరాకుగా వుంటున్నావు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ వుంటావు. ఏమిటా ఆలోచన?"

"నీ కేమని చెప్పను లలితా!"

"నేను చెప్పనా?'' లలిత నవ్వింది.

"ఊఁ.''

"శంకర్ నిన్ను పెళ్ళిచేసుకోమని అడిగాడుకదూ? అవునా?"

"అవును" సంధ్య ముఖం ఎఱ్ఱబడింది.

"నువ్వేమన్నావు?''

"నేనేం చెప్పలేదు లలితా. నేనెటూ నిర్ణయించుకోలేకుండా వున్నాను."

లలిత మౌనంగా వూలు అల్లుతూ కూర్చుంది.

"స్త్రీ జీవితంలో ఒకేసారి ఒకే పురుషుణ్ణి ప్రేమిస్తుంది అంటారు. నిజమేనా లలితా? ఆ మాటలు నువ్వు నమ్ముతావా?"

"నేను నమ్మను."

"వివాహితురాలు భర్త నికాక, పరాయి వ్యక్తిని ప్రేమించడం మహా పాప మంటావా?"

లలిత గలగలా నవ్వింది. "అంత ఘోరమైన నేరం కాదులే."

"నీకంతా హాస్యంగా వుంది." కోపం తెచ్చుకుంది సంధ్య

"నాకు సరదాగానే వుంది మరి నీకేదో పెద్ద కొండంత సమస్య ఎదురైనట్టు తలపట్టుకు కూర్చుంటే, చూడ్డానికి నాకు తమాషాగానే వుంది."

"నాకు సమస్య లేదంటావా?" ఆశ్చర్యంగా, బాధగా చూసింది సంధ్య.

"నీ కొచ్చిన కష్టమేమిటమ్మాయ్? నీ పిల్లలకి తండ్రిలేడు. నీవు నాలుగేళ్ళుగా అన్నా, వదినలమీదఆధారపడివున్నావు. ఇప్పుడు నీ సంసారంలో సత్యం ఖాళీ చేసిన స్థానంలోకి శంకర్ వస్తానంటున్నాడు. నీకు తోడుగా నీడగా వుంటానంటున్నాడు. నీ పిల్లలకి తండ్రినౌతానంటున్నాడు. ఒంటరిగా, భారంగా నడుస్తున్న నీకు అతను చేతులు అందిస్తానంటున్నాడు. ఆ బలమైన చేతులను అందుకోకుండా తటపటాయించడం నీ అవివేకం."

"ఎంత తేలిగ్గా చెప్పావు లలితా? నేను రాత్రిళ్ళు నిద్రపట్టక ఎంత కుమిలిపోతున్నానో నీకేం తెలుసు!"

"ఎందుకుట?"

"ఇద్దరు పిల్లలతో మళ్ళీ పెళ్ళా? నాకేమిటో పాపంచేస్తున్నట్టు భయంగా వుంటోంది."

"ఏం పాపం చేస్తున్నావు?"

"సత్యానికి అన్యాయం చేస్తున్నట్టు అనిపిస్తుంది."

"సత్యానికి నువ్వేలా ద్రోహం చేస్తున్నావు సంధ్యా? అతనికి నూరేళ్ళు నిండాయి. అతని దారి అతను చూసుకున్నాడు. ఒంటరిగా మిగిలిపోయింది నువ్వు. నీ కిప్పుడు ఎన్నేళ్ళు? ఇరవై ఎనిమిదికదూ? ఇంకా నీ నిండుజీవితం, ఒడుదుడుకులు, ముసలితనం ముందరే ఉన్నాయి. ఎన్నాళ్లని మీ అన్నా, వదినల మీద ఆధారపడి వుంటావు? మధూ, లీలా మంచివారే అనుకో! కాని వారి సంసారం పెద్దదిగా పెరిగి, ఆర్థిక యిబ్బందులు చికాకుపెడితే ఎవరి మనసు ఎలా మారుతుందో చెప్పలేం. నువ్వీ చిన్న ఉద్యోగం చేస్తూ, నీ కాళ్ళమీద నువ్వు నిలబడగలవా? నీకు తోడు కావాలని వుండదా? భార్య చనిపోయిన మగవాడు రెండో పెళ్ళి చేసుకుంటే మనం తప్పు పడుతున్నామా? పైగా 'మంచిపని చేసాడు. ఒంటరిగా ఎన్నాళ్ళు ఉండగలడు?' అంటున్నాం. అదే పరిస్థితులలో స్త్రీ తిరిగి ఎందుకు వివాహం చేసుకోకూడదూ? విశాల హృదయుడు, శంకర్ లాంటివాడు సహచరుడుగా లభిస్తే నీ జీవితం ఎంతో సుఖమయ మవుతుందికదూ?"

"నీకు తెలియదు లలితా! ఎన్నో భయాలు. పిల్లలు యీ క్రొత్త పరిస్థితులకి తట్టుకోగలరా? తెలిసినవాళ్ళంతా ఏమనుకుంటారు?"

"పిల్లల విషయంలో నీవు నిశ్చింత వహించవచ్చు. అతనికి వాళ్ళంటే యిష్టం, పిల్లలకి శంకర్ అంటే అపేక్ష. అతను వాళ్ళని సర్దుకోగలడు. పోతే సంఘానికి నువ్వు భయపడటం తెలివి తక్కువతనం. నువ్వు తప్పుచేయటం లేదని మనస్ఫూర్తిగా నమ్మినపుడు, యింకో వ్యక్తికి హానిచెయ్యనపుడు నిన్నెవరూ ఏమి చెయ్యలేరు. మంచి పనికి ఎప్పుడూ భగవంతుడి సహాయం, సహృదయుల తోడ్పాటు ఉంటుంది."

"నువ్వన్ని సమస్యలనీ ఎంతో సుళువుగా పరిష్కరించేస్తున్నావ్. బహుశః అవి నీ సమస్యలుకాక, ఎదుటి వ్యక్తి సమస్యలు కావటంవల్లేమో!"

లలిత నవ్వింది. "అది నిజం సంధ్యా. ఎదుటివారి సమస్యలు గోరంతలుగా, మనవ్యక్తిగత సమస్యలు కొండంతలుగా ప్రతీవారికీ తోచడం సహజం."

"అన్నిటికంటె పెద్దసమస్య ఒకటి వుంది లలితా." అని సంధ్య మౌనంగా వుండిపోయింది.

"ఏమిటి?"

సంధ్య ఏదో చెప్పనా, వద్దా అని తటపటాయిస్తోంది. ఆమె పరిస్థితి గమనించి గట్టిగా నవ్వింది స్నేహితురాలు.

"ఏమిటోయ్? నా దగ్గిర అంత సంశయం?"

"ఏమీలేదు" సంధ్య తల విదిలించేసి వూరుకుంది.

"నీకు శంకర్ అంటే యిష్టంకదూ?" లలిత రెట్టించింది.

"నా గురించి ఆలోచించుకుంటూ వుంటే నాకే అర్థంకాదు లలితా. సత్యాన్ని పెళ్ళిచేసుకున్నాను. మూడేళ్ళు కాపురంచేశాను. ఇద్దరు పిల్లలకి తల్లినయ్యాను. ఇప్పుడు నా జీవితంలో యీ విపరీతం ఏమిటి? భగవంతుడు నాకెందుకీ పరీక్ష పెట్టాడు? అతనియెడల నాకీ ఆకర్షణ ఏమిటి? నాది చంచలమైన మనసా? నా మనసు నేను చెప్పినమాట వినదు. నామీద నాకే కోపంవస్తుంది. వైరాగ్యంలో పడవలసిన నా మనసు, రాగబంధంవైపు ఎందుకు పరుగెడుతోంది? నన్ను నేను సంబాళించుకోలేక, పరిస్థితులతో రాజీపడలేక నలిగిపోతున్నాను." సంధ్య కళ్ళలో నీళ్ళు నిండుకున్నాయి.

"పిచ్చిపిల్లా బాధపడకు. స్త్రీకి భర్తే జీవితమనీ, అతని తోడిదే లోకమనీ, భర్తృవియోగమైతే అతని స్మృతులతో భార్య శేషజీవితాన్ని గడిపేయాలనీ— యిలాంటి పురాతన భావాలు మన రక్తంలో జీర్ణించుకుపోయాయి. నీ మనసు ఆ భావాలని వ్యతిరేకిస్తోంది. నీలో విప్లవం వుంది. పాత, క్రొత్త

భావాల మధ్య మనసు నలిగిపోవడం సహజం కాని నువ్వు తప్పుచేస్తున్నట్టు నేను కొంచెంకూడా అనుకోటంలేదు. ఒంటరితనం భరించటం కష్టం మంచి జంట దొరికే అవకాశం ఉన్నప్పుడు ఒంటరిగా వుండిపోవడం అనవసరం. ఇంతకీ ఎంతమంది స్త్రీలకి యిలాంటి అవకాశం వస్తుంది? ఇంకోమాట చెప్పనా? సత్యాన్ని నీ తల్లిదండ్రులు ఎంచి నీకు భర్తగా చేసారు. శంకర్ నీమనసుకి నచ్చినవ్యక్తి, నువ్వు కోరుకున్న గుణాలుకలవాడు."

"ఒకసారి కాపరం అలా మంట కలిసాక, మళ్ళీ యింకో బంధం కలిపించుకోవాలంటే ఏదో తెలియనిభయం లలితా," సంధ్య రుమాలుతో కళ్ళు తుడుచుకుంది

"ఇల్లు కూలిపోయిందే అనుకో! అలా అని చెట్టుక్రింద ఎన్నాళ్ళు నిలబడతాం? స్తోమతవుంటే యింకో యిల్లు కట్టుకోడానికి ప్రయత్నించమా?" సంధ్య చేయి తన చేతిలోకి తీసుకుని నొక్కుతూ అంది లలిత. స్నేహితురాలి వాత్సల్యం ఆమెకి మనోనిబ్బరాన్నిచ్చింది.

దూరంగా పిల్లలు రావడం కనిపించింది.

"తొందరలో శుభవార్త తెలియ బరచు అవివేకంగా అందిన అవకాశాన్ని జారవిడుచుకోకు. శంకర్ చాలా మంచి వాడు" అంటూ లేచింది లలిత

లలితలాంటి దగ్గిరస్నేహితురాలికి కూడా చెప్పుకోలేని భయం ఒకటి సంధ్య హృదయంలో అలాగే వుండిపోయింది.

* * *

3

మూడు నెలల తర్వాత 'మే' నెలలో శంకర్, సంధ్యా భార్యాభర్తలయ్యారు. శంకర్, మధుతో ఆలోచించి బొంబాయికి బదిలీ చేయించుకున్నాడు. క్రొత్త ప్రదేశంలో ఉద్యోగంలో చేరేముందు పదిహేను రోజులు సెలవు తీసుకుని ముసోరి ప్రయాణం పెట్టాడు.

ఆ రోజు ఉదయం పదకొండు గంటలకి రిజిస్ట్రారు ఆఫీసుకి వెళ్ళారు. సంధ్యవైపునించి మధు, లీల, లలితా, శంకర్ వైపునించి అతని స్నేహితుడు గోకుల్ వారి వివాహానికి సాక్ష్యులుగా నిలిచారు. లీల నూతన దంపతుల గౌరవార్థం యింట్లోనే పెద్దఎత్తున విందు భోజనం ఏర్పాటుచేసింది. ఆడబడచుకు క్రొత్త చీరా, పసుపూ, కుంకుమా యిచ్చి ఆదరించింది

శంకర్, సంధ్యా రాత్రి ముసోరీ ఎక్స్‌ప్రెస్‌లో డెహరాడూన్ బయలు దేరారు. పిల్లలని తమదగ్గిర వుంచుకుంటామన్నారు మధూ, లీలా కాని శంకర్, సంధ్యా యిద్దరూకూడా యిష్టపడలేదు. పిల్లలతోనే తరలివెళ్ళారు. సంధ్య తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా యిచ్చింది.

మర్నాడు ఉదయం పదిగంటలకి

డెహరాడూన్ చేరి, టాక్సీలో ముసోరీ వెళ్ళారు. ముసోరీ కొండలమీద చల్ల గాలి తగలగానే ఆ ఎండాకాలంలో వారికి హాయి అనిపించింది. పిల్లలు ముందునించే ప్రయాణం మాట విని గెంతువేసారు.

వాళ్ళు దిగిన హోటల్ ఎత్తుప్రదేశంలో కట్టారు. పిల్లలిద్దరూ గదిలో ప్రతి కిటికీ దగ్గిరకీ వెళ్ళి బయటికి చూశారు. "అమ్మా, అమ్మా, తొందరగా రా. అది చూడు. అదేమిటి?" అన్నాడు బాబు, కళ్ళు పెద్దవిచేసుకుని బయటికి చూస్తూ.

సామాను సర్దుతున్న సంధ్యా, శంకర్ ఒక్కసారే తలఎత్తి కిటికీలోంచి చూసారు.

"అదా! ఏరియల్ రోప్‌వే అంటారు," అది సంధ్య, తనూ కుతూహలంగా చూస్తూ.

"అమ్మా, మనం అలాంటిది సినిమాలో చూశాము కదే" అంది నీల.

'ఊс.'

శంకర్ కిటికీదగ్గిరకివచ్చి పిల్లల వెనకాల నుంచున్నాడు. మనుష్యులని ఎక్కించుకుని ఆకాశంలో అటూ, యిటూ తీగమీద కదులుతున్న పెట్టెని వాళ్ళిద్దరూ చూస్తున్నారు. వారి కళ్ళలో ఎంతో ఆశ్చర్యం.

"అది ఎక్కుదామా బాబూ?" అన్నాడు శంకర్, బాబు భుజంమీద చెయ్యి వేస్తూ.

"ఎక్కుదాం అంకుల్," నీల అతని చెయ్యిపట్టుకుని ఊపింది.

"తప్పకుండా ఎక్కుదాం. తరవాత అయిస్క్రీమ్ తిందాం. మళ్ళీ బోలెడు బొమ్మలు కొనుక్కుందాం."

అతని మాటలు విన్నకొద్దీ వారి ఉత్సాహం పెరిగింది.

"నేను చెప్పినమాట వినాలి మీరు."

"ఏమిటి?" అన్నట్టు పిల్లలు అతని ముఖంలోకి చూశారు.

"నన్ను అంకుల్ అని పిలవడం మానెయ్యాలి"

"ఎందుకు మానెయ్యాలి?" నీల ఆశ్చర్యం.

"నాన్నా అని పిలవాలి."

సామాను సర్దుతూ, వారిమాటలు వింటున్న సంధ్యకి ఒక్కసారి గుండె దడదడ లాడింది.

"మన డాడీ ఫోటోలో ఉన్నారు కదమ్మా?" నీల తల్లివైపు తిరిగింది.

"ఆయన డాడీ. నేను నాన్న." శంకర్ సంధ్యని ఆపదనించి రక్షించాడు.

"అంకుల్ నాన్న ఎలా అవుతారు?" మళ్ళీ నీల.

"అంకుల్ యిప్పుడు నాన్న అయిపోయాడు. దేముడు చేసేసాడు."

శంకర్ మాటలని నమ్మలేనట్టు చూసిందా పిల్ల.

"బాబూ, అంకుల్‌ని ఏమని పిల వాలి?" శంకర్ బాబు వైపు తిరిగాడు.

"అంకుల్ అని."

"ఉహుఁ నాన్న. నీకు గన్ కొంటాను."

"పెద్ద గన్ కావాలి అంకుల్."

"మళ్ళీ అంకుల్ అంటే కొనను."

"నాన్నా, గన్ కావాలి," బాబు నవ్వేశాడు.

"నాకూ గన్ కావాలి, నాన్నా," నీల అతని చెయ్యి పట్టుకుంది. కాని నాన్నా అని పిలిచినపుడు, దాని ముఖంలో సిగ్గో, క్రొత్తో, అయిష్టమో-ఏ భావమూ స్పష్టంగా తెలియలేదు.

సంధ్యకి ఆ వాతావరణం గాలి ఆడనట్టు ఉక్కిరిబిక్కిరిగా వుంది. తువాలూ, చీరా తీసుకుని బాత్‌రూంలోకి తప్పుకుంది.

ఆమె స్నానంచేసి వచ్చేసరికి శంకర్, పిల్లలూ కిటికీదగ్గిర కూర్చుని కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

సంధ్య పిల్లలిద్దరినీ స్నానంచేయించి, ముస్తాబు చేసేసరికి, శంకర్ తయారయ్యాడు. అందరూ హోటల్లో భోజనం చేసి, బయటపడ్డారు.

అక్కడి వాతావరణం తమాషాగా వుంది. పైన బాగా ఎండగా వుంది. అయినా గాలి అతిచల్లగా వుంది. ఆ చల్లగాలికి స్వెటర్‌లు అవసరం అని పించేటట్టు వుంది.

కొండమీద మనుష్యులు పొట్టిగా, బలంగా వున్నారు. "వీళ్ళని 'గఢ్ వాలీలు' అంటారు," అన్నాడు శంకర్, హోటల్ దగ్గిరనించి క్రిందికి వేసిన దారిలో నడుస్తూ.

రోప్‌వే మీద బాక్సులో కూర్చుని వెళుతూవుంటే ఆకాశంలో వ్రేలాడు తున్నట్టే వుంది. నీలా బాబూ భయంతో తల్లిచీర గట్టిగా పట్టుకున్నారు. రోప్‌వే వారిని ఆ కొండలమీద ఎత్తైన శిఖరానికి చేర్చింది. 'లాల్ డిబ్బా' మీద నిలిచి చూస్తే దూరంగా హిమాలయాలు కనిపిస్తున్నాయి. వేసవికాలం కావడంవల్ల ముసోరి కొండలమీదికి చల్లదనంకోసం చాలామంది వచ్చారు. కొంతమంది విదేశీయులు.

"అదేమిటి అంకుల్, కెమేరానా?" అన్నాడు బాబు, యిద్దరు విదేశీయులని చూపిస్తూ.

"బాబూ, ఇందాక ఏంచెప్పాను?" నవ్వాడు శంకర్.

బాబు అర్థంకానట్టు చూసాడు

నీల నవ్వి "నాన్న," అంది.

"నాన్నా, అదేమిటి?" అన్నాడు తిరిగి బాబు.

"వాటిని బైనాక్యులర్స్ అంటారు. అందులోంచి చూస్తే, దూరంగా వున్న

వస్తువులు దగ్గరగా, పెద్దవిగా కనిపిస్తాయి.

''నాకు కావాలి."

"వద్దు, బాబూ, తప్పు. ఇంకొకరి వస్తువులని అలా అడగకూడదు," అంది సంధ్య.

''ఇక్కడ కూచుందామా?" అన్నాడు శంకర్, ఆమె ప్రక్కకి వస్తూ.

సంధ్య కూచుంది. ఆమెకి కొద్ది దూరంలో అతను కూచున్నాడు. విపరీతంగా వున్న గాలికి ఆమె కట్టుకున్న తెల్ల సిల్కుచీర పైకి ఎగిరిపోతూంది. పైట అస్తమానూ ఎగిరి అతని భుజాన్ని తాకుతుంది. చీరచెరుగు నడుంమీద నించి తీసుకొని దోపుకుంటున్న ఆమె ఒక్కసారి అతనిని చూసి ఆగిపోయింది. అతను ఆమెవైపే చూస్తున్నాడు. అతని కళ్ళు క్రొత్తగా వున్నాయి. వాటిలో కోరిక. ఆమెకి ఒక్కసారి ఒళ్ళంతా మంచులా చల్లబడింది. ముఖం అటు తిప్పేసుకుంది.

పిల్లలు యిద్దరూ విదేశీయులతో పరిచయం చేసుకుని, బైనాక్యులర్స్ తీసుకుని దూరపు కొండలని చూస్తున్నారు.

చుట్టూ కొండలు. క్రింద లోతైన లోయలు. ఎత్తైన పచ్చనిచెట్లు. హృదయాన్ని ఆహ్లాదపరిచే వాతావరణం. వాళ్ళక్కడకొద్దిసేపు కూర్చుని, లేచారు.

పిల్లలద్వారా శంకర్‌కి విదేశీయులతో పరిచయం కలిగింది. వాళ్ళిద్దరూ అమెరికానుంచి వచ్చారు వారు బదరీనాథ్ వెళ్ళాలని వచ్చారు. కాని వారి టాక్సీకి యింకా ముగ్గురు ప్రయాణీకులు అవసరం. ఎవరేనా వస్తారేమోనని చూస్తున్నారు.

"సంధ్యా, మనం బదరీ వెళదామా?" అన్నాడు శంకర్ ఆమెని చూస్తూ.

బధరీనాధ్ పేరు వినగానే ఆమె హృదయం ఉప్పొంగింది. ఎక్కడో మంచుకొండలలో వెలసిన ఆ క్షేత్రం పేరు వినడమేగాని, చూడలేదు. "మీకు వీలైతే, తప్పక వెళదాం" అంది.

ఆమె సరదాపడుతోందని గ్రహించాడతను. వెంటనే అమెరికనులతో మాట్లాడాడు. హోటల్‌కివెళ్ళి టాక్సీకి ఫోనుచేసి, మర్నాడు ప్రొద్దున్నే బయలుదేరడానికి నిర్ణయించారు.

అప్పటికే చీకటిపడుతోంది సంధ్యనీ పిల్లలనీ బజారుకు తీసుకువెళ్ళి బదరీ ప్రయాణానికి అవసరమైన వూలుబట్టలు కొన్నాడు. తానొక స్వెటర్ కొనుక్కున్నాడు.

పిల్లలిద్దరూ అలసిపోయారు. వస్తూనే పడుకున్నారు.

గదిలోవున్న మంచాలు చూస్తూంటే సంధ్యకి అప్పటిదాకా వున్న ఉత్సాహమంతా ఆవిరిలా హరించుకుపోయింది. ఆ గదిలో రెండుమంచాలు కలిపి

ఉన్నాయి. విశాలమైన ఆ కర్రమంచాల మీద డన్‌లప్ పరుపులు, తెల్లదుప్పట్లూ.

శంకర్ పేపరు చదువుతూ కూర్చున్నాడు. కాని అతను పేపరు అడ్డంపెట్టుకుని ఏదో ఆలోచిస్తున్నాడని తెలుస్తూనే వుంది.

ఆమె కిటికీ దగ్గిరకి కుర్చీ జరుపుకొని కూర్చుంది. మనసులో ఏదో తెలియని పిరికితనం. శంకర్ తన పిల్లలకి తండ్రి అయ్యాడు. తనకి రక్షణ కల్పించాడు. నూతన జీవితాన్ని యిచ్చాడు. కాని తను అతనికి ఏమి యివ్వగలదు? తన సర్వస్వాన్నీ అర్పించుకోవాలనే కృతజ్ఞత వుంది. కాని తన దగ్గిర ఏముందని యివ్వగలదు? తాను కన్య కాదు. పాత జ్ఞాపకాలు తనని వెన్నంటి అతనికి దూరంగా ఉంచుతాయి. ఒకే గదిలో, ఒకే మంచంమీద అతనితో గడపగలదా? దానికి తన శరీరం, మనసూ, రెండూ వ్యతిరేకిస్తాయి. కాని ఎన్నాళ్ళిలా?

అతను పేపరు మడిచిపెట్టి, ఆమెకి దగ్గిరగా నడిచివచ్చాడు. ఆమె కూర్చున్న కుర్చీమీద చేతులువేసి "నిద్ర రావటం లేదా?" అన్నాడు.

ఆమెకి భయంతో అంత చలిలోనూ చెమటలు పోసాయి.

"నిద్ర రావటంలేదు. ఇంకాస్సేపు కూర్చుంటాను."

అతను కాస్సేపు అలాగే నుంచున్నాడు.

"తొందరగా పడుకోండి. మళ్ళీ రేపు ప్రయాణం వుంది," అని చెప్పి అతను వెళ్ళిపోయాడు. ఆమె మనసు కుదుటబడింది. అతను లైటు ఆర్పి, పిల్లలకి ఒక వైపు పడుకున్నాడు.

సంధ్య చాలాసేపు అక్కడే కూర్చుంది. శంకర్ కూడా నిద్రపోలేదని అతను అటూ, ఇటూ కదలడంబట్టి తెలుస్తూనే వుంది.

చివరికి అతను పడుకుని వుంటాడని నిశ్చయానికి వచ్చాక, ఆమె లేచివెళ్ళి, పిల్లలని మధ్యకి జరిపి రెండోచివర పడుకుంది.

''సంధ్యా" వులిక్కిపడి లేచిందామె. వంగివున్న అతనిముఖం ఆమెకి దగ్గిరగా ఉంది. తడబాటుతో లేచి కూర్చుంది.

"లేస్తారా? టైమవుతోంది. ఆరు గంటలకంతా మనం బయలుదేరాలి" అన్నాడతను నిటారుగా నిలబడుతూ. ఆమె సర్దుకుని లేచింది.

వాళ్ళు తయారై, మధ్యలో డెహరాడూన్‌లో టిఫిన్ తీసుకుని, దారికి పళ్ళూ, రొట్టె, జామ్, బిస్కట్లూ కొనుక్కుని, టాక్సీ రోడ్డు ఎక్కేసరికి ఎండ పైకి వచ్చేసింది.

"అదిగో గంగ" అన్నాడు శంకర్, చేతితో నీలికి చూపుతూ. ఋషీకేశ్ దగ్గిర గంగమీద వంతెనదగ్గిర, డ్రైవర్ టాక్సీ ఆపి, "దీన్ని లక్ష్మణఝూలా అంటారు" అన్నాడు ఆ వంతెన తీగలతో కట్టినది. వుయ్యాలలా నదిమీద వ్రేలాడుతోంది. క్రింద స్తంభాలుకాని, మరే కర్రలుకాని ఊతగా లేవు మనుషులు వంతెనమీద నడుస్తూంటే అది ఊగుతోంది. ఝూలా అంటే ఉయ్యాల అని విదేశీయులకి విశదపరిచాడు శంకర్. వాళ్ళు ఆ వంతెన ఫోటో తీసుకున్నారు.

టాక్సీ కదిలింది. సంధ్య కుతూహలం కూడా హెచ్చింది. కొండ ఎక్కడం ప్రారంభించింది టాక్సీ. వారితోపాటు గంగానదీ వచ్చింది. కుడివైపు గంగ, ఎడమవైపు కొండలు. "గంగ యిక్కడినించీ మనతోనే వస్తుంది. బదరీ దాకా వస్తుంది'' అన్నాడు డ్రైవరు. మధ్య మధ్యలో చిన్న చిన్న పాయలు వచ్చి గంగలో కలుస్తున్నాయి. అవి కలిసే ప్రదేశాలు ప్రయోగలు.

లోతుగా లోయలోకి వెళిపోతుంది గంగ ఒకసారి. ఇంకోసారి వాళ్ళ దారి కడ్డంగా ప్రవహిస్తుంది. ఒకచోట నిశ్శబ్దంగా, అమాయకురాలిలా ఉంటుంది. ఇంకో కొండ దాటేసరికి జింకపిల్లలా గెంతులువేస్తూ, తృళ్ళితృళ్ళి పడుతూ

వుంటుంది. ఆ గంగ చేసే తమాషాలు, సోయగాలూ, దాటిపోతున్న ఎత్తైన కొండల బారులూ చూస్తూ పరవశించి పోయింది సంధ్య.

"అమ్మా ఎంత పైకి వెళ్లిపోయామో!" అంది నీల, క్రింద లోయలలోకి చూస్తూ.

"అమ్మా! ఆకాశంలో వెళ్లి పోతున్నాం" అన్నాడు బాబు.

ఇంతలోనే అంతఎత్తుకొండా మాయమై మైదానంలోకి ప్రవేశించింది టాక్సీ.

అమెరికన్‌లు – జార్జ్, మైక్ ముందు డ్రైవరు ప్రక్కన కూర్చున్నారు. వెనక శంకర్, సంధ్య, పిల్లలూ కూచున్నారు. పిల్లలిద్దరూ చెరో కిటికీప్రక్కనా కూచో డంతో, ఆమె, అతనూ మధ్యన కూచోక తప్పలేదు. పిల్లలు అటూ, యిటూ కదిలినప్పుడల్లా ఆమే, అతనూ మరీ దగ్గిరగా వస్తున్నారు. అతనికి అంత దగ్గిరగా, తాకుతూ కూర్చుంచే ఆమెకి ఊపిరి సలపనట్టు సిగ్గుగా వుంది. కాని అతను చాలా ఉత్సాహంగా ఉన్నాడు. అతని ముఖంలో ఓ ఆనందం వెల్లి విరిసింది.

చల్లగాలికీ, కారుఊపుకూ పిల్లలు నిద్రపోయారు. రాత్రి నిద్రలేక సంధ్య కూడా తూగుతోంది. శంకర్ మీద ఎక్కడ పడతానో అనే భయంతో మళ్ళీ బలవంతంగా నిద్ర ఆపుకుంటోంది.

కాని ఆమె ప్రయత్నం ఫలించలేదు, నిద్ర ఆమెని జయించింది. ఒడిలో బాబుని పెట్టుకునే ఆమె నిద్రపోయింది. అలా ఎంతసేపు నిద్రపోయిందో! టాక్సీ ఆగిన కుదుపుకు కళ్ళు తెరచింది. ఆమె అతని మీద ఒరిగి పడుకునివుంది. అతని ఒక చెయ్యి ఆమెచుట్టూ తిరిగి కుడిభుజం మీదనించి వ్రేలాడుతోంది. రెండోచెయ్యి ఒళ్ళో పడుకున్న నీల తలమీదవుంది. అతను రెండు చేతులతోనూ తల్లీ, కూతుళ్ళని పొదవి పట్టుకుని నిద్రా భంగం కాకుండా కాపాడినట్టువుంది. సంధ్య సిగ్గుపడుతూ లేచి సమంగా కూర్చుంది.

"ఎక్కడికి వచ్చాం?"

"ఈ ఊరిపేరు శ్రీనగర్. డ్రైవరు టీ తాగుతాడుట. మీకూ కావాలా?" అతనింకా ఆమెని 'మీరు' అనడం మానలేదు.

పిల్లలు లేచారు. అతను వెళ్ళి డిక్కీ లోంచి పేముబుట్ట పైకితీసాడు. ఆమె బ్రెడ్‌కి జామ్‌రాసి, పిల్లలకీ, శంకర్‌కీ, విదేశీయులకీ యిచ్చింది. టీ త్రాగి, పళ్ళు తింటూ ప్రయాణం సాగించారు.

సంధ్య బయటికి చూస్తూ కూచుంది. ఈమారు అతను నిద్రలోకి జారాడు. అతను సంకోచమేమీ లేకుండా ఆమె భుజానికి ఆనుకుని తలపెట్టుకుని సుషుప్తిలో పడ్డాడు. ఆమెకి అతనిని చూస్తే ఆశ్చర్యం వేసింది. రెండేళ్ళుగా శంకర్‌తో పరిచయంవున్నా, అతను ఒక హద్దు లోనే వుండేవాడు. ఏనాడూ అతిగాగాని,

ఆసభ్యంగాకాని అతను ప్రవర్తించలేదు. ఆమెకి గౌరవం యిస్తూ, దూరంగానే మసిలేవాడు. కాని యీ రెండు రోజులలో అతనిలో చాలామార్పువచ్చింది. ఆమెకి దగ్గరగా రావాలని ప్రయత్నం, ఆమెను తాకడంలో ఓ కాంక్ష అతనిలో కనిపిస్తున్నాయి. మెళ్ళో తాళిగట్టడంతో అతనికి ఆమెమీద ఆ చనువు వచ్చిందేమో! కాని ఆమె సహజంగా వుండలేకపోతూంది.

మళ్ళీ టీకోసం టాక్సీ 'పీపల్ కోట్'లో ఆగింది. ఈ మారు గాలి చల్లగా తాకింది. పిల్లలిద్దరికి స్వెటర్స్ వేసింది సంధ్య. "సాయంత్రం నాలుగు గంటలైతే బదరీరోడ్డు మూసేస్తారు. మనం జ్యోషీమఠ్‌లో ఆగిపోవాలి," అన్నాడు డ్రైవరు, టాక్సీ స్టార్ట్‌చేస్తూ.

'జ్యోషీమఠ్'! సమీపిస్తూ వుంటే దూరంగా మంచు నిండిన శిఖరాలు కనిపించాయి. "అదిగో మంచు' అని చూపించాడు శంకర్. పిల్లలు ఆశ్చర్యంగా చూసారు.

జ్యోషీమఠ్‌లో ఆ రాత్రి ఆగిపోయారు. వేరేగది దొరకకపోవడంతో విదేశీయులు శంకర్ కుటుంబంతో ఒకే గదిలో గడిపారు. అది సంధ్య మనసుకు శాంతినిచ్చింది.

మర్నాడు ఉదయమే బదరీనాథ్ ప్రయాణం. "పదివేల అడుగుల పైకి వెళతాం" అన్నాడు శంకర్, సంధ్యతో. దారంతా ఎత్తైన మంచుకొండలు. గలగల పారే గంగానది. సూర్యుడి కిరణాలు పడి మెరుస్తోంది మంచు. "అమ్మా, తెల్ల కొండలు," అన్నాడు బాబు.

బదరీనాథ్ హిమాలయపర్వతాలమధ్య విశాలమైన లోయలో ఉంది. ఆ లోయ చూస్తూనే పరవశించింది సంధ్య. చుట్టూ మంచుకొండలు. మధ్యనలోయ. లోయని రెండుగా చీలుస్తూపారే గంగానది. ఆమె మనస్సు సంతోషంతో నృత్యం చేసింది.

హోటల్లో గది తీసుకుని, సామాను పడేసి, గుడిదగ్గిర వేడినీళ్ళ కుండాలలో స్నానంచేశారు. దేముడి దర్శనం చేసుకుని, లోయంతా కలయతిరిగారు. పర్వత సానువులలోంచి పారే మంచి నీటి జలపాతాల దగ్గిరకి వెళ్ళి చూసారు. "అబ్బ! అమ్మా యీ నీళ్ళు ఎంత చల్లగా వున్నాయో" అంది నీల, నీటిలో పెట్టిన కాలు గబుక్కున వెనక్కి తీసుకుంటూ.

"మంచు చూద్దాం రండి" అంటూ శంకర్ కొండలమీదికి దారితీసాడు. ఉత్సాహంతో అతని వెనకే పరిగెత్తాడు బాబు.

మంచు గట్టిగా రాయిలా వుంది. ఓ చిన్న కర్రముక్క తీసుకుని శంకర్ దానిమీద గీసి, మెత్తని పువ్వురేకుల లాంటి మంచుని తీసి ముద్దచేసి, బాబు మీదికి విసిరాడు.

"అంకుల్ నాన్నా, నాకూ కావాలి" బాబు ఎగిరాడు.

"అంకుల్‌ని విడిచిపెట్టు."



"నాన్నా! నాకూ యివ్వవ్" అంది నీల, అతని వెనక చేరుతూ. పిల్లలూ, అతనూ మంచుమీద నిలబడ్డారు

"నీలా, మంచు చల్లగా లేదా?" అంది సంధ్య, దూరంగా నిలబడి.

"లేదమ్మా, నువ్వూ రా."

సంధ్య అక్కడే తటపటాయిస్తూ నుంచుంది.

శంకర్ పిల్లలచెవుల్లో ఏదోచెప్పాడు. వెంటనే మూడు మంచుముద్దలు ఎగిరి వచ్చి సంధ్యని తాకి, క్రిందికి పూలజల్లులా జారిపోయాయి.

''వద్దు, వద్దు" ఆమె నవ్వుతూ చేతులు అడ్డంపెట్టింది. ఆమె వద్దన్నకొద్దీ ఆమెమీద మంచువర్షం కురిసింది. సంధ్యకూడా మందుకునడిచి వారితో చేరి మంచుతీసి పిల్లలమీద విసిరింది. వాళ్ళు నలుగురూ కాసేపు చిన్నపిల్లలై ఆడుకున్నారు బాబూ, నీలా కేరింతలు పెట్టారు. పిల్లల సరదా, వారి ఉత్సాహం చూసి, ఆమెకి ఆనందంతో కళ్ళలో నీళ్ళు వచ్చాయి.

"మీ అమ్మ ఓడిపోయింది. ఏడుస్తోంది'' అన్నాడు శంకర్, నవ్విస్తూ. పిల్లలిద్దరూ ఆమె దగ్గిరిగా చేరి "అమ్మా ఓడిపోయావా?" అంటూ చప్పట్లు కొడుతూ, అతనితోపాటు నవ్వారు.

చీకటిపడుతూ వుంటే, వారు అయిష్టంగానే హోటల్‌దారి పట్టారు. ఆమెకి గాలిలో తేలిపోతున్నట్లు హాయిగావుంది.

అద్దెకి తెచ్చిన రొజాయిలు వెచ్చగా కప్పుకుని, పిల్లలు నిద్రపోయారు.

ఆమె ముడి విప్పుకుంటూ, నిలువు టద్దంముందు స్టూలుమీద కూర్చుంది. అద్దానికి ఎదురుగావున్న సోఫామీద అతను కూచుని సిగిరెట్టు కాలుస్తున్నాడు. అతని ముఖం ఆమెకి అద్దంలో కనిపిస్తోంది. అతని కళ్ళలో మెదిలే కోరిక ఆమెని కలవరపెట్టింది.

సంధ్య లేచి కిటికీ దగ్గరికి వెళ్ళి నిలుచుంది. పైన వెన్నెల వెన్నెలలో మంచు శిఖరాలు అద్భుతంగా ఉన్నాయి. వెన్నెల నురుగులలో మగురుతున్నట్టు ఉంది లోయ.

శంకర్ లేచి ఆమెదగ్గిరకి వచ్చాడు. ఆమెని తన వైపుకి తిప్పుకున్నాడు. అతని కన్నులలో వెన్నెల మెరిసింది. ఆమె ముఖాన్ని తన చేతులలోలకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు శంకర్.

ఆ ముద్దులో వేడిలేదు. పసితనం ఉంది. మంచులా, చల్లగా వున్నాయతనిపెదవులు. అతనిఒళ్ళంతా వణుకుతోంది. అతనిలో ఏదో బెదురు. శంకర్‌ని చూస్తే ఆమెకి ఎందుకో నవ్వు వచ్చింది. అతని కళ్ళలోకి చూస్తూ ఆమె నవ్వింది. అతనూ నవ్వాడు హఠాత్తుగా ఆమెలో యీ మూడురోజులుగా ఉన్న భయం పోయింది. ఆమెలో ప్రేమ వెల్లువై ప్రవహించింది. అతని భుజం మీద చేతులువేసి దగ్గరగా తీసుకుని, అతని రెండుచెంపలమీదా గాఢంగా ముద్దుపెట్టుకుంది.

"నువ్వు నా గురువ్వి" అన్నాడతను ఆమె భుజంమీద తలపెట్టి- అవును. తనైతే మూడేళ్ళుకాపురంచేసింది అతనికి అదే మొదటిసారి!

ఆ రాత్రి ఆమె మూడేళ్ళలో తను నేర్చుకున్న అనుభవ సారమంతా అతనికి ఓ గంటలో నేర్పింది.

"నవ్వకు. తొందరలోనే నీకు పాఠాలు చెప్పగలను" అన్నాడతను, ఆమె ఒళ్ళో తలపెట్టి పడుకుంటూ.

ఆమె వంగి ప్రేమగా అతని శిరస్సుని చుంబించింది. అతను తృప్తిగా నిద్రపోయాడు.

సంధ్య క్రొత్త జీవితానికి నాందీ పలికింది. 'ఈ రోజుగురించి ఎంత భయపండిది తాను! పాతజీవితాన్ని మర్చిపోలే ననుకుంది. కాని ఎంత తమాషా! కాలం అన్ని జ్ఞాపకాలనూ మరుగుపరుస్తుంది. కాలం అన్ని గాయాలనీ మాన్పుతుంది. మరిచిపోవడం అన్న వరమే మానవునికి లేకపోతే జీవితం ఎంత దుర్భరం అవుతుంది! ఏడ్చినకళ్ళు మళ్ళీ ఎప్పటికీ నవ్వలేవు భగవాన్, నీ సృష్టి ఎంత విచిత్రం!' అనుకుంది సంధ్య, దూరంగా కనిపిస్తున్న నారాయణుని మందిరానికి చేతులు ఎత్తి మ్రొక్కుతూ.